క్లుప్తంగా

సంత వేలం రేపు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ పంచాయతీలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంతకు ఈ నెల 3న వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గ్రామ సచివాలయం వద్ద విస్తరణ అధికారి సమక్షంలో బహిరంగ వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ. 2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న మూడు ముఖాలమ్మ ఆలయ నిర్మాణానికి ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆర్థికసాయం చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 20 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లంగి నారాయణస్వామి, శరణప్ప, లాలుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయ భవన నిరాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆ శాఖ జిల్లా చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించారు. పాఠకుల వినతి మేరకు మండలంలో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం గ్రంథాలయ భవనం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, మండల గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి, పాఠకులు పాల్గొన్నారు.

మక్కా మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: ఓబుళాచారి రోడ్డు వద్ద ఉన్న మక్కా మసీదులో శనివారం సాయంత్రం కాలనీకి చెందిన ముస్లిం యువకుల మిత్ర బృందం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉపవాస దీక్ష అనంతరం దాదాపు వెయ్యి మంది ముస్లింలు ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు.

అతివల అభ్యున్నతే సీఎం లక్ష్యం



మెగా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



హాజరైన డ్వాక్రా మహిళలు

- మహిళలను మహారాణులను చేస్తున్న ముఖ్యమంత్రి
- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలో మూడు విడతల్లో 7,146 మందికి సుమారు రూ.17.5 కోట్ల రుణ మాఫీ చేసి అతివల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పాలన సాగిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని నమ్మబలికి.. అధికారంలోకి వచ్చాక రుణమాఫీ చేయకుండా డ్వాక్రా సంఘాలు బలహీనపడేలా చేశాడన్నారు. కానీ సీఎం జగన్ నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికి మూడు విడతల్లో రుణమాఫీ చేసి మహిళలకు అండగా నిలిచారన్నారు. మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ మహారాణులను చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు ఎల్లో మీడియాని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై అసత్య రాతలు, ప్రసారాలు చేయిస్తున్నాడని మండిపడ్డారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి చేపడుతున్న సీఎం జగన్‌కు మహిళలంతా అండగా ఉండాలన్నారు. ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీటిని తెస్తామని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రైతులను నిలువునా మోసం చేశాడన్నారు. కానీ విశ్వేశ్వర రెడ్డి పట్టువీడని విక్రమార్కుడిలా సీఎం దృష్టికి తీసుకుపోయి ప్రత్యేక జీఓ తెప్పించి నిధుల మంజూరుకు కృషి చేసి, ఆ రెండు చెరువులకు శాశ్వతంగా నీటి విడుదలకు కృషి చేసిన ఘనత విశ్వేశ్వర రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. థ్యాంక్యూ సీఎం సార్ ..మీకు రుణపడి ఉంటామని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్విని, మండల విజేత సమాఖ్య అధ్యక్షురాలు గంగమ్మ, వైస్ ఎంపీపీలు దేవా, సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తోపుదుర్తి వెంకటలక్ష్మమ్మ , సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు దేవేంద్ర, బైరెడ్డి రామచంద్రారెడ్డి, నిర్మలమ్మ, గంగాధర్, ఎంపీడీఓ ఎంకే బాషా, ఏపీఎం మధుసూదన్, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళలకు భరోసా





సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ, హాజరైన మహిళలు

- భవిష్యత్‌లో టీడీపీని భూస్థాపితం చేద్దాం
- మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

కళ్యాణదుర్గం: వైఎస్సార్ ఆసరా పథకంతో ప్రతి మహిళలకు ఆర్థిక భరోసా అందిస్తున్నామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ మహిళా సంక్షేమ కోసం బడ్జెట్‌లో సింహభాగం నిధులు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో మహిళల కోసం రూ. 500 కోట్లు ఖర్చు పెడితే వైఎస్సార్‌సీపీ ఏకంగా రూ. 1,500 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ బడులను సైతం కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన, విద్యా దీవెనతో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తూ పేద పిల్లల ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ల కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తంలో చంద్రబాబు మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. పసుపు కుంకుమ పేరుతో రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నాడని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పొత్తు పెట్టుకుంటే ఎవరు సీఎం అవుతారనేది వారికే క్లారిటీ లేదన్నారు. రాబోవు రోజుల్లో టీడీపీని భూ స్థాపితం చేద్దామని పిలుపునిచ్చారు. పచ్చ పత్రికలు తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రుణాలను మాఫీ చేస్తామని మహిళలు, రైతులను మభ్యపెట్టాడని విమర్శించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా 3వ విడతలో భాగంగా కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో రూ.4.36 కోట్లు, మున్సిపాలిటీలో రూ. 3.84 కోట్లు మెగా చెక్కులను మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. అంతకుముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలసి మంత్రి, ఎమ్మెల్సీ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఏసీ రాధారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, ఎంపీపీ మారుతమ్మ, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమ, వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ, సీనియర్ నాయకుడు సుధీర్, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాటకాలు మన సంస్కృతికి ప్రతీకలు



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

డి హీరేహాళ్(రాయదుర్గం): నాటకాలు మన సంస్కృతికి ప్రతీకలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకుని డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురంలో శనివారం రాత్రి నిర్వహించిన హేమారెడ్డి మల్లమ్మ నాటికను విప్ కాపు ప్రజలతో కలసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. టి సినిమాలకు మూల రూపం నాటకాలేనని, ఏ భాషలోనైనా తొలి చలన చిత్రాలు నాటక కథలతోనే తెరకెక్కించారన్నారు. గతంలో పండుగలు వచ్చాయంటే గ్రామాల్లో బైలు నాటకాలు, పౌరాణిక నాటకల ప్రదర్శన చేపట్టేవారన్నారు. సెల్‌ఫోన్లు, సీరియల్స్, సినిమాలు పెరగడంతో అనాటి గొప్ప సంప్రదాయం కనుమరుగయ్యే స్థితికి చేరుతోందన్నారు. అనంతరం సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో విప్ కాపు, మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి ని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తొండె వెంకటేశులు, సింగాడి మంజు, విజయ్‌గౌడ, ధర్మేంద్రపాటిల్ పాల్గొన్నారు.

మురడిలో పూజలు

డి హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని అర్చన చేయించారు. విప్ వెంట మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, ఓబుళాపురం సర్పంచ్ మల్లికార్జున ఉన్నారు.

చెక్కభజన క్రీడాకారులకు విప్ ఆర్థికసాయం

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో యన్నేరంగస్వామి రథోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన చెక్కభజన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి వీక్షించారు. అనంతరం ఆయన ఐదు చెక్కభజన బృందం సభ్యులకు రూ.10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ యంద్రకాయల వంద్రప్ప, నాయకులు కెనిగుంట రామిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, అశోక్, అనిల్, కేజీ ఈరన్న పాల్గొన్నారు.

విద్యార్థులతో కూలి పనులు!



బెంచీలను క్లాస్ రూమ్‌లోకి మోస్తున్న విద్యార్థులు

బొమ్మనహాళ్: విద్యార్థులతో ఉపాధ్యాయులు బెంచీలు మోయించడం విమర్శలకు దారితీసింది. మండలంలోని ప్రతిభ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఎ.బి సెంటర్‌లో 500 మంది విద్యార్థులకు ఈ నెల 3 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం వాహనంలో 100 బెంచీలను మరో పాఠశాల నుంచి తీసుకొచ్చారు. కూలీలను పెట్టకుండా ఉపాధ్యాయులు బెంచీలను క్లాస్ రూంలోకి విద్యార్థులతో మోయించారు. మరో రెండు రోజుల్లో పబ్లిక్ పరీక్షలు పెట్టుకుని విద్యార్థులతో ఇలాంటి పనులు చేయించడమేంటని తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. మరి దీనికి విద్యాధికారులు ఎలాంటి సమాధానం చెబుతారో చూడాలి.

నేడు 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు

రాయదుర్గం: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించ తలపెట్టిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాల సభను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండన్న, వైకేపీ ఏసీ గంగాధర, మెప్మా కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివ, కౌన్సిలర్ శ్రీనివాస రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ చందన రామాంజనేయులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాయదుర్గం అర్బన్, రూరల్‌కు చెందిన మహిళా సంఘ సభ్యులకు సంయుక్తంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అర్బన్‌లో 791 డ్వాక్రా సంఘాలకు రూ.4.57 కోట్లు, రూరల్‌లో 597 సంఘాలకు రూ.3.46 కోట్లు విలువ చేసే మెగా చెక్కు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన ఆదివారం ఉదయం 10 గంటలకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన మండలస్థాయి మూడవ విడుత వైఎస్సార్ ఆసరా సభ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచు మోనాలిసా తెలిపారు. శనివారం వజ్రకరూరులో ఏర్పాటు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. ఇదిలా ఉండగా వైఎస్సార్ సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, సర్పంచు మోనాలిసా, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, బీసీసెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్ సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



కురాకులపల్లిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం మండలంలోని కురాకులపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను గడప వద్దకు వెళ్లి సకాలంలో అందజేస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, వైస్ ఎంపీపీ బీమేష్, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు నూతిమడుగు రామ్మోహన్, కదిరిదేవరపల్లి హనుమంత రాయుడు, నాగరాజు, నాగు, రామచంద్ర, రామాంజనేయులు, ముత్యాలప్ప,అక్కులప్ప పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కంబదూరు మండలంలోని అయ్యంపల్లిలో ఆదివారం ఉదయం 11 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

3న వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం పరిధిలోని వివిధ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి 3వ తేదీ సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 3, 4, 11, 12, 13, 17 సచివాలయాల్లో 10 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

3 నుంచి పప్పుశనగ కొనుగోలు పునఃప్రారంభం

ఉరవకొండ: స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి పప్పుశనగ కొనుగోలు పునః ప్రారంభించనున్నట్లు చైర్మన్ వడ్ల హాజీ షేక్షావలి తెలిపారు. శనివారం ఉరవకొండ పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లు బ్యాళ్ల ప్రసాద్, చిదంబప్ప, సీఈఓ శిలార్ మహ్మద్ గౌస్‌తో కలసి ఆయన మాట్లాడారు. 3వ తేది వెలిగొండ, 4,5న ఆమిద్యాల, 6న రాకెట్ల, 7వ తేదీ కొకుంట్ల గ్రామాల రైతుల నుంచి పప్పుశనగ కొనుగోలు చేస్తామన్నారు.

సింహవాహనంపై జంబుకేశ్వరుడు



రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామి సింహవాహనం ఊరేగించారు. ఆదివారం స్వామి శేష వాహనోత్సవం నిర్వహిస్తామని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

ఉనికి చాటుకోవడానికే
'కాలవ' కుటిల యత్నాలు

గుమ్మఘట్ట: కాలవ శ్రీనివాసులు తన ఉనికి చాటుకోవడానికే కుటిల యత్నాలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు ఆరోపించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. రాయదుర్గానికి చుట్టుపుచూపుగా వచ్చి పోతున్న కాలవ శ్రీనివాసులు పత్రికల్లో ఎక్కేందుకు కుటిల పన్నాగం పన్నుతున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యతకల్పించి గిరిజన పుత్రుడైన భోజరాజనాయక్‌కు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలను వాడుకుని కుటిల బుద్ధితో అణచివేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదలను ఆదరించి అత్యున్నత పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో సహజ వనరులను దోచుకుని కోట్లాది రూపాయలను అక్రమార్జనకు పాల్పడింది ప్రజలు మరచిపోలేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామప్ప,కొల్లప్ప, ఆనంద్, వెంకటేశులు,సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఉరవకొండ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప తెలిపారు. శనివారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. "ప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారులు నరసింహరాజు, పెన్నోబుళేసు, ఉలిగన్న పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

కళ్యాణదుర్గం: మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లకు సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా సచివాలయ కన్వీనర్లు తప్పక హాజరు కావాలన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

శెట్టూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ లలిత శనివారం తెలిపారు. కేజీబీవీలో 6వ తరగతి ప్రవేశంతో పాటు, ఇంటర్‌లో ఎంఈసీ గ్రూప్(మ్యాథ్స్, ఎకనామిక్స్, కామర్స్ సబెక్టు) కావాల్సిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కబడ్డీ విజేతగా గొడిశెలపల్లి జట్టు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లిలో శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఉద్దేహాళ్ జట్టుపై గోడిశెలపల్లి జట్టు విజయం సాధించింది. ప్రథమ బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, నాలుగో బహుమతి రూ,2,500 నగదును సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్ రాళ్ల రామలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, వైస్ సర్పంచ్ నారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సంతాపం

బెళుగుప్ప: మండలంలోని కోనంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట ఎర్రిస్వామి(65) అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి శనివారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో మండల ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు ఎర్రిస్వామి, నాగిరెడ్డి, రాందాసు, అనంతరెడ్డి, గోవిందు, హనమంతరాయుడు తదితరులున్నారు.

కూల్స్ డేగా పాటించాలి

ఉరవకొండ: ఏప్రిల్ ఫస్ట్ ఫూల్స్‌డే గా కాకుండా కూల్స్‌డేగా పాటిస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని అర్బన్ సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి, జైకిసాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగమల్లి ఓబుళేసు తెలిపారు. శనివారం జైకిసాన్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉరవకొండ బైపాస్ వద్ద జాలెమ్మవ్వ మఠం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి

ఉరవకొండ: విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండలో ఎక్కువసేపు ఉండటం మంచిది కాదని రాకెట్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ సూచించారు. శనివారం మండలంలోని రాకెట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వడదెబ్బపై ఆయన అవగాహన కల్పించారు.

ఉంతకల్లులో ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకం చేసి, మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున తులసి మాలధారణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఉరవకొండ: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని గదక్‌లో ఈ నెల 31న నిర్వహించిన జాతీయ సమగ్రత శిబిరంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని పలు పతకాలు, సర్టిఫికెట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గదక్‌లో ఏర్పాటు చేసిన జాతీయ సమ గ్రత శిబిరంలో సాంస్కృతిక ప్రదర్శనల్లో కూచిపూడి విభాగంలో సుచరిత, జాతీయ సమైక్యత కోసం నిర్వహించిన లఘునాటికలో సరిత, ఖాదర్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. అనతరం విద్యార్థులను అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్స్ వెంకటరాముడు, అల్తాఫ్, అధ్యాపకులు హనుమంతరెడ్డి, శివ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఉత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆంజినేయ స్వామి చిత్రపటాన్ని రథంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు.

వేరుశనగలో పంటకోత ప్రయోగం

కూడేరు: మండలంలోని గొటుకూరులో రైతు మహేశ్వరి సాగుచేసిన వేరుశనగ పంటలో శనివారం వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగం చేపట్టారు ఈ సందర్భంగా 12.37 కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ నవత తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీహెచ్ఏ పుల్లప్ప, ఇన్సూరెన్స్ ప్రతినిధి చంద్ర, వీఆర్ఏ జ్ఞానేష్, రైతులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని గురుడాపురం రోడ్డులో శనివారం ఆటో బోల్తా పడి గరుడాపురం గ్రామానికి చెందిన బోయ మారుతి, హనుమంతరాయుడు గాయపడ్డారు. కళ్యాణదుర్గంలోని మిల్లు నుంచి బియ్యం బస్తాలను స్వగ్రామానికి తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు క్షతగాత్రులను కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉరవకొండ: స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ, తాగునీటి చలివేంద్రాన్ని అర్బన్ సీఐ హరినాథ్ ప్రారంభించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిష్టప్ప, సభ్యులు మీనుగ ఎర్రిస్వామి, వెంకటస్వామి, నారాయణస్వామి, బుక్కిట్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.